ఎలక్ట్రికల్ వర్కర్లు సంఘటితంగా ఉండాలి

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లు, ప్లంబర్లు సంఘటితంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. ఎలక్ట్రీషియన్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక నూర్జహాన్ కళ్యాణ మండపంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఎలక్ట్రీషియన్లు రోజువారీ జీవన విధానంలో ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని, ఇలాంటి తరుణంలో ప్రతి ఒక్కరూ అన్ని జాగ్రత్తలు తీసుకొని విధులు నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా కలిగి ఉండాలన్నారు. పలువురు అతిథులు తమ వంతుగా అసోసియేషన్‌కు విరాళాలు ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు తమ వృత్తిలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటుంటారన్నారు. ఎలక్ట్రీషియన్లకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం లక్కీడీప్ ద్వారా ఎలక్ట్రీషియన్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హఫీజుల్లా, సూర్యనారాయణరావు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మియ్యా, అసోసియేషన్ నగర అధ్యక్షుడు చిట్టి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షులు ప్రసాద్, షరీఫ్, నాగేశ్వరరావు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్‌కు విరాళం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ,చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస విజయానికి కృషి చేయాలి



ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాపై చర్చిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, ఇన్‌చార్జులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల జాబితాను పరిశీలించాలని, ఎవరెవరి ఓట్లు జాబితాలో ఉన్నాయో వారందరినీ వ్యక్తిగతంగా కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు.
అనంతరం డివిజన్ల వారీ గా కార్పొరేటర్లకు ఓటర్ల జాబితా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యు లు పాకా సురేష్ కుమార్, సుబ్బారెడ్డి, ఎస్ఎండీ జహీర్, కె. సూర్యనారాయణరావు, అరీఫుల్లా బాషా, మేసా ప్రసాద్, షఫీ, నాగేంద్ర, కె. బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

31న పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 31న ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ పీఎఫ్ కార్యాలయం ఎదుట చేస్తున్న ధర్నా జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగులు రమణారెడ్డి, వీరమల్లేష్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ దశల వారీ ఆందోళనలు చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టులలో నీరు నిల్వ ఉన్నప్పటికీ వాటిని పంట పొలాలకు ఉపయోగించుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. జిల్లాలోని సర్వరాయ సాగర్, వామి కొండ ప్రాజెక్టులకు ఇప్పటి వరకు పిల్ల కాల్వలు పూర్తి అవ్వకపోవడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు ఈశ్వరయ్య, సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, జయన్న పాల్గొన్నారు.

అనధికారిక ఫ్లెక్సీలపై చర్యలు చేపడతాం

– కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి హెచ్చరిక

కడప అర్బన్: కడప నగర పరిధిలో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినా, అనుమతులు తీసుకున్న వారిలో గడువు ముగిసిన వాటిని తొలగిస్తామని కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి తెలియజేశారు. శుక్రవారం ఆయన కడపలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనధికారిక ఫ్లెక్సీలపై చర్యలు చేపడతామన్నారు. నగరపాలక సంస్థ, ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతులు పొందిన వారు, ఏర్పాటు చేసుకునే ఫ్లెక్సీలను వారే కాపాడుకోవాలన్నారు. గాలికి, వానకు చిరిగినా వివాదాలకు దిగకుండా, వాటిని అప్రమత్తంగా కాపాడుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. అనవసరంగా అల్లర్లకు, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతే మనదేశానికి బలం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

వైవీయూ : ప్రపంచంలో మరే దేశానికి లేనటువంటి యువత మనదేశానికి ప్రత్యేక బలమని జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. వల్లూరు బ్రహ్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని గాంధీనగర్ నగర పాలకోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో వేర్వేరుగా స్టెప్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం-కెరీర్ కౌన్సిలింగ్ అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాకారం కోసం శ్రమించాలని సూచించారు. స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ మాట్లాడుతూ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యసుజాతమ్మ, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, నోబాల్ సేవాసంస్థ అధ్యక్షుడు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న తలనీలాల సేకరణకు వేలం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వర స్వామి ఆలయంలో తలనీలాల సేకరణ కోసం ఈనెల 30వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సి.శివయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా, మిగిలిన రోజుల్లో తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని బద్వేలు దేవాదాయశాఖ కార్యాలయంలో అధికారుల సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు రెండు రోజుల పాటు తలనీలాలు సేకరించుకునేందుకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, అలాగే మార్చి 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 29 వరకు తలనీలాలు సేకరించేందుకు వేలంపాటలో పాల్గొనేందుకు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. డిపాజిట్ నగదు రూపంలో చెల్లించాలని, హెచ్చుపాటదారుడు వేలంపాట ముగిసిన వెంటనే డిపాజిట్‌తో కలిపి మొత్తం నగదు చెల్లించి రసీదు పొందాలన్నారు. అలా చెల్లించని యెడల పాటదారుని డిపాజిట్‌ను అపరాధ రుసుము కింద దేవస్థానం ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం దేవాదాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం



సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపంలోని హజరత్ సయ్యద్ షావలీ దర్గాలో గురువారం రాత్రి ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించామని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఉరుసులో ముస్లింలు, హిందువులు పాల్గొని ప్రార్థనలు జరిపారు. సిద్దవటం వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్‌సీపీ నాయకుడు ఉపాసి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖవ్వాలి ఆకట్టుకుంది.

నకిలీ ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

పెండ్లిమర్రి : నకిలీ ఎరువులు, పురుగు మందులను దుకాణాదారులు రైతులకు అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. అలాగే రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అనంతరం ఎరువుల దుకాణంలో ఉన్న స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, ఏఈలు కిషోర్, జనార్దనరావు, ఏఓ బ్రెస్‌లీ పాల్గొన్నారు.

నకిలీ ఓట్ల నమోదు తగదు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నకిలీ ఓట్లు నమోదు చేయడం తగదని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జిల్లా కార్యవర్గ ముఖ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీనం పేద విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వీటితోపాటు పలు రకాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, జిల్లా నాయకులు బాధుల్లా, నరసింహ, సుభాషిని, అనేష, శ్రావణి, సిందూరి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతి

కడప కల్చరల్: ఆంధ్ర భోజుడిగా ఖ్యాతికెక్కిన చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు అని బలిజ అభ్యుదయ సేవా సమితి (బాస్) అధ్యక్షులు దాసరి శివప్రసాద్ అన్నారు. శ్రీకృష్ణ దేవరాయల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో తొలుత కార్యాలయంలో రాయల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు సగినాల శ్రీనివాసులు, బలిజ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సుబ్రమణ్యంలతో కలిసి నగరంలోని శ్రీకృష్ణ దేవరాయల సెంటర్‌లోగల రాయల విగ్రహం వద్దకు చేరి పాలాభిషేకం, పూలాభిషేకం నిర్వహించారు. కేకును కట్ చేశారు. ఈ ప్రాంతంలో ఎన్నో చెరువులు, బావులు తవ్వించి మొక్కలు నాటించి, సత్రాలను కట్టించి ప్రజల సంక్షేమానికి అనితర సాధ్యమైన కృషి చేశారన్నారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త ముగ్గురాళ్ల అమరప్ప, కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణ స్వామి, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య, బాస్ అధ్యక్షులు ఏనుగుల వెంకట సుబ్బయ్య, ఇతర ప్రతినిధులు కొమ్మినేని రాఘవేంద్ర, సుధీర్, రాజాస్వామి, భూపతిరాయల్, మస్తాన్ రాయల్, సమ్మెట సత్యనారాయణ, గోల్డ్ రవి, ధర్మతేజ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాయల విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రారంభానికి సిద్ధమైన భానుకోటేశ్వరస్వామి క్షేత్రం

– ఫిబ్రవరి 1 నుంచి మూడు రోజులపాటు కార్యక్రమాలు

సింహాద్రిపురం : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోటేశ్వరస్వామి క్షేత్రం ప్రారంభానికి సిద్ధమైంది. రూ.4 కోట్లకుపైగా తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో ఆలయ జీర్ణోద్ధరణ పనుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయం అత్యంత సుందరంగా నిర్మితమై అందరిని ఆకర్షిస్తోంది. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో భానుకోట క్షేత్రాన్ని నూతన హంగులతో నిర్మించడం జరిగిందని గ్రామ సర్పంచ్ మహేశ్వర రెడ్డి, దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ శంకర బాలాజీ, ఆలయ కార్య నిర్వాహణాధికారి విశ్వనాథ రెడ్డిలు తెలిపారు.



నూతన ఆలయాలు,

విగ్రహ పునఃప్రతిష్ట వేడుకలు :
రావులకొలను పంచాయతీ పరిధిలోని భానుకోటేశ్వరస్వామి క్షేత్రంలో వేడుకలను ఫిబ్రవరి 1వ తేదీనుంచి మూడవ తేదీవరకు నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వండి

గోపవరం : చిరుధాన్యాల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎ.నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని రాచాయపేటలో నిర్వహించిన చిరుధాన్యాల సాగు-వినియోగంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిరుధాన్యాలకు అంతర్జాతీయ గుర్తింపు రావడంతో 2023వ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ మేరకు పంటల సాగు, ఉపయోగాలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వరి, సజ్జ పంటల పైనే రైతులు ఆధారపడుతున్నారని, ఈ పంటల వలన ఖర్చు అధికంగా ఉండటమే కాక రాబడి తగ్గుతుందన్నారు. చిరుధాన్యాల సాగుకు ఈ ప్రాంతం అనువైనదని, తక్కువ నీరు, ఖర్చు తక్కువ, రసాయనిక ఎరువుల వాడకం తక్కువగా ఉండటంతో రైతుకు లాభసాటిగా ఉంటుందని, దీంతో రైతులు పంటల సాగుకు మొగ్గు చూపాలని ఆయన కోరారు. వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు మంచి అవగాహన ఉందని, ఇంకా అవసరమైన సలహాలు, సూచనలు వ్యవసాయాధికారుల ద్వారా తెలుసుకుని ముందుకు వెళ్లాలన్నారు. బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం ఉటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ అరవిందనాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్-17 షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



షూటింగ్ బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్, తదితరులు

వేంపల్లె : వేంపల్లెలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అండర్-17 షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. శుక్రవారం డీఎస్‌డీఓ ఆదేశాల మేరకు జిల్లా షూటింగ్ బాల్ జిల్లా కార్యదర్శి నిత్య పూజయ్య నేతృత్వంలో పోటీలు నిర్వహించి జిల్లా తరపున ఆడేందుకు జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపికైన వారు ఈనెల 29వ తేదీన చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ శాప్ లీగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, పీడీ తేజేంద్ర, క్రీడాకారులు తెలిపారు.

భద్రకాళికి విశేష పూజలు



రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలోని భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, వేదపండితులు రాచరాయ యోగిస్వామి వారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయలతో తయారు చేసిన హారాన్ని అమ్మవారికి అలంకరించారు. అనంతరం భక్తులకు రాహుకాల పూజల విశేషాలను వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి దాతల సహకారం



దాతలకు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని ఇస్తున్న అర్చకులు

వేంపల్లె : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ.2,25,580లు సహకారం అందించారు. శుక్రవారం దాతలు ఆ మొత్తాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్‌లకు అందజేశారు. వేంపల్లె పట్టణానికి చెందిన ఎం.సుబ్బారెడ్డి, శారద దంపతులు రూ.1,00,116లు, హైదరాబాద్‌కు చెందిన రామచంద్రారెడ్డి, వేదవతి దంపతులు రూ.50,116లు, రామకృష్ణారెడ్డి, సుజాత దంపతులు రూ.25,116లు, కడపకు చెందిన చంద్రమౌళి, తులశమ్మ దంపతులు రూ.25,116లు, వేంపల్లె పట్టణం చింతలమడుగుపల్లెకు చెందిన ఎస్.అరుణ్‌కుమార్‌రెడ్డి రూ.25,116ల నగదును అందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి మాట్లాడుతూ శాశ్వత నిత్యాన్నదాన పథకం ద్వారా ప్రతి రోజు 200 మంది భక్తులకు అన్నదానం చేయడం జరుగుతోందని.. దాతలు మరింత మంది ముందుకొస్తే మరింత మందికి భోజన వసతి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దాతలకు ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజాలు ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు అన్నదానం

కడప కార్పొరేషన్: తిరుమల తొలి గడప దేవునికడప తిరుణాళ్ల సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలోని పద్మావతి కళ్యాణ మండపంలో కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక ఉద్యోగులు, పాలకవర్గం ఒక ప్రకటనలో తెలిపింది. కార్పొరేటర్లు, ఇన్‌చార్జులు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

కమలాపురం : స్థానిక దర్గా-ఇ-గప్ఫారియా ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్గా-ఇ-గప్ఫారియా, నవీన్ న్యూరో కేర్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రముఖ న్యూరాలజిస్ట్ ఎస్‌వీ నవీన్ ప్రసాద్ రోగులను పరీక్షించి వైద్య సేవలు అందిస్తారని వారు తెలిపారు. పక్షవాతము, నరముల బలహీనత, తిమ్మిర్లు, మంటలు, మెడ, నడుము నొప్పి, కళ్లు, తల తిరగడం, నిద్ర సమస్యలు, నరాలు లాగడం, మైగ్రేన్ తదితర రోగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. రూ.3 వేలు విలువ జేసే ఎముకల సాంద్రత పరీక్ష, రూ.2 వేలు విలువజేసే నరాల పటుత్వ పరీక్ష, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, అలాగే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని, మండల వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కడప మేయర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు, కడప మేయర్ సురేష్‌బాబును కడపలోని ఆయన నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కలిశారు. ఇటీవల సురేష్‌బాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఎమ్మెల్యే రాచమల్లు ఆయనను పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సురేష్‌బాబు త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

రథసప్తమి వేడుకలకు సిద్ధమైన ఆలయాలు



చెన్నూరులో ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

చెన్నూరు : రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని శనివారం చెన్నూరులోని లక్ష్మి వెంకటేశ్వర స్వామి (కోట్ల స్వామి), చెన్నూరు సరస్వతీ కాలనీలోని శ్రీ లక్ష్మి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు, భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. చెన్నూరు సరస్వతి కాలనీలోని లక్ష్మి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమం, వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

రేపటి నుంచి నల్లనమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లె గ్రామంలోని నల్లనమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం గ్రామోత్సవం ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు న్యూ కేటగిరి ఒంగోలు జాతి ఎద్దులచే రాతిదూలం లాగుడు పోటీలు ఉంటాయన్నారు. భక్తులకు రెండు రోజులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.